# నో హెల్మెట్ నో ఎంట్రీ అమలు.

## డోర్నకల్ 13వ వార్డులో కట్టుదిట్టమైన చర్యలు.

**డోర్నకల్ ఏప్రిల్ 3 సూర్య న్యూస్:–** డోర్నకల్ మున్సిపల్ పరిధిలోని 13వ వార్డులో "నో హెల్మెట్ నో ఎంట్రీ" నిబంధనను పోలీసులు పగడ్బందీగా అమలు చేస్తున్నారు. మహబూబాబాద్ జిల్లా ఎస్పీ శబరిష్ ఆదేశాల మేరకు సిఐ చంద్రమౌళి ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక చర్యలు కొనసాగుతున్నాయి. గత వారం రోజులుగా ఎస్సై గడ్డం ఉమా, ఎస్సై వంశీధర్ పర్యవేక్షణలో పోలీస్ బృందాలు ఇల్లు ఇల్లు తిరుగుతూ ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాల వివరాలను సేకరిస్తున్నాయి. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ వినియోగించాలని సూచిస్తూ, హెల్మెట్ వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. గత రెండు రోజులుగా హెల్మెట్ లేకుండా 13వ వార్డులోకి ప్రవేశం లేదని స్పష్టం చేస్తూ వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో 13వ వార్డు కౌన్సిలర్ ఎల్లావుల సువర్ణ హరికృష్ణ సైతం పాల్గొని, వార్డును ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. అదేవిధంగా రాష్ డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్, డ్రింకింగ్ డ్రైవింగ్ చేయరాదని పోలీసులు హెచ్చరిస్తున్నారు. గంజాయి వంటి మాదకద్రవ్యాల వినియోగం యువతను చెడు వ్యసనాలకు గురిచేస్తోందని, దొరికిన వారికి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీనిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. గ్రామ భద్రతను మరింత బలోపేతం చేయడానికి 13వ వార్డులో సీసీ కెమెరాల ఏర్పాటు చేపట్టాలని, ప్రజలు సహకరించాలని పోలీసులు సూచించారు. అసాంఘిక కార్యకలాపాలు, దొంగతనాలు నివారించడంలో ఇవి కీలకంగా ఉంటాయని వివరించారు. ఈ సందర్భంగా పోలీస్ బృందం తీసుకుంటున్న చర్యలకు కౌన్సిలర్ ఎల్లావుల సువర్ణ హరికృష్ణ 13వ వార్డు ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



## హెల్మెట్‌తో తాటి చెట్టు ఎక్కిన గౌడన్న భద్రతపై ప్రత్యేక సందేశం ఇచ్చిన గీత కార్మికుడు.

**తాడిచెట్టు ఎక్కాలన్నా బండి నడపాలన్న హెల్మెట్ పెట్టాలన్న.గౌడ్ అన్న.**



**డోర్నకల్ ఏప్రిల్ 3 సూర్య న్యూస్:–** నర్సింహులపేట మండలం కౌసల్యాదేవిపల్లి గ్రామంలో భద్రతపై చైతన్యం కలిగించే ఒక విశేష ఘటన చోటుచేసుకుంది. గండి కమలాకర్ అనే గీత కార్మికుడు తాటి చెట్టు ఎక్కేటప్పుడు హెల్మెట్ ధరించి అందరికీ ఆదర్శంగా నిలిచారు. సాధారణంగా తాటి చెట్లు ఎక్కడం ప్రమాదకరమైన పని కావడంతో, తన భద్రత కోసం ఆయన హెల్మెట్ ఉపయోగించడం స్థానికుల దృష్టిని ఆకర్షించింది. ద్విచక్ర వాహనంపై ప్రయాణించే సమయంలో కొందరు హెల్మెట్ ధరించడం భారంగా భావించి నిర్లక్ష్యం చేస్తుంటారు. అయితే గండి కమలాకర్ మాత్రం తన ప్రాణ భద్రత కోసం తాటి చెట్టు ఎక్కేటప్పుడు కూడా హెల్మెట్ ధరించడం ద్వారా, భద్రత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదనే సందేశాన్ని ప్రజలకు అందిస్తున్నారు. ఈ ఘటనను చూసిన గ్రామస్థులు కమలాకర్‌ను అభినందిస్తూ, ఆయన చూపించిన జాగ్రత్త ప్రతి ఒక్కరూ అనుసరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రమాదాలు ఎప్పుడు, ఎక్కడ జరుగుతాయో తెలియదు కాబట్టి చిన్న జాగ్రత్త కూడా ప్రాణాలను కాపాడగలదని ఈ ఘటన స్పష్టం చేస్తోంది. ప్రజలు తమ భద్రత కోసం హెల్మెట్ వంటి రక్షణ పరికరాలను తప్పనిసరిగా ఉపయోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. గండి కమలాకర్ చేసిన ఈ చర్య సమాజానికి ఒక మంచి సందేశంగా నిలుస్తోంది.

## మారనున్న గుడి చెరువు రూపురేఖలు

**మురుగు నీటి మళ్లింపునకు యుద్ధ ప్రాతిపదికన పైపులైన్ పనులు**

**పట్టణ సుందరీకరణే లక్ష్యం: గుడి చెరువు పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్**



**వేములవాడ టౌన్ ఏప్రిల్ 3 సూర్య న్యూస్ :–** వేములవాడ మున్సిపాలిటీని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దే క్రమంలో పట్టణాభివృద్ధి పై పాలకవర్గం ప్రత్యేక దృష్టి సాదించింది. ముఖ్యంగా రాజన్న క్షేత్రానికి వచ్చే భక్తులకు ఆహ్లాదాన్ని పంచేలా గుడి చెరువును అభివృద్ధి చేసే పనులు వేగవంతమయ్యాయి. చెరువులోకి పట్టణంలోని మురికి నీరు చేరకుండా, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు గుడి చెరువు నుండి మూల వాగు వరకు చేపట్టిన అండర్ గ్రౌండ్ పైపులైన్ నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ పవిత్రమైన గుడి చెరువు కలుషితం కాకుండా చూడటమే తమ ప్రథమ ప్రాధాన్యతని పేర్కొన్నారు. ఇందుకోసం ఎమ్మెల్యే చొరవతో భారీ నిధులతో డ్రైనేజీ మళ్లింపు పనులు చేపట్టామన్నారు. పనులు పూర్తయిన తర్వాత గుడి చెరువు పర్యాటక కేంద్రంగా మారుతుందని, పట్టణ సుందరీకరణలో ఇది కీలకమని ధీమా వ్యక్తం చేశారు. వార్డుల వారీగా సమస్యల పరిష్కారం తోపాటు పట్టణ ప్రాముఖ్యత ఉన్న ప్రాంతాలను ఆధునీకరిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ తనిఖీలో వైస్ చైర్మన్ నరాల శేఖర్, వార్డు కౌన్సిలర్ ముత్యం, మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## ట్యాంకుల పరిశుభ్రతను పరిశీలించిన సర్పంచ్ మర్రి సంధ్య



**అశ్వాపురం ఏప్రిల్ 3 సూర్య న్యూస్ :–** మండల పరిధిలో గల మొండికుంట గ్రామపంచాయతీ లోని మిషన్ భగీరథ వాటర్ ట్యాంకుల పరిశుభ్రతను శుక్రవారం సర్పంచ్ మర్రి సంధ్య పరిశీలించారు. గ్రామపంచాయతీ లోని ప్రజలకు మంచినీటిని సరఫరా చేసే ట్యాంకుల శుభ్రతను తానే స్వయంగా పరిశీలించారు. వాటర్ ట్యాంకుల లోపల మంచినీరు ఎంత శుభ్రంగా ఉన్నాయి అని ప్రజలకు మంచినీటి ద్వారా సంక్రమించే డయేరియా వంటి అంటు వ్యాధులు రాకుండా వాటర్ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని బ్లీచింగ్ క్లోరినేషన్ చేయాలని మంచినీటిని సరఫరా చేసే పైపులైన్ లో కూడా ఎక్కడా లీకేజీలు లేకుండా మరమ్మతులు చేయాలని పైప్ లైన్ సంపుల లో నీరు కలుషితం కాకుండా ఎప్పటికప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సిబ్బందిని ఆదేశించారు.

## స్మశాన వాటిక దారికి మోక్షం ఎప్పుడో



**అశ్వాపురం ఏప్రిల్ 3 సూర్య న్యూస్:–** అశ్వాపురంలోని దళితులకు, బీసీలకు కేటాయించిన స్మశాన వాటికకు వెళ్లే దారి లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఇసంపల్లి కృష్ణ అన్నారు. ఆయన శుక్రవారం అశ్వాపురంలో విలేకరులతో మాట్లాడుతూ ఏళ్లుగా ఈ సమస్య పరిష్కారం కోసం ఎదురు చూస్తున్న గ్రామ దళితులు, బీసీలు అధికారుల నిర్లక్ష్యంపై ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని,ఇళ్ల మధ్య నుండి,పంట పొలాలు గుండా వెళ్లాల్సిన పరిస్థితి రావడంతో వివాదాలు తలెత్తుతున్నాయన్నారు.ప్రభుత్వ భూమిలోనే దారి ఉన్నప్పటికీ, ఇప్పటివరకు దానిని అందుబాటులోకి తీసుకురావడంలో అధికారులు విఫలమయ్యారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారన్నారు . ఈ విషయమై పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినా, ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.ఇటీవల జిల్లా కలెక్టర్ గ్రామాన్ని సందర్శించిన సందర్భంగా కూడా ఈ సమస్యను స్థానికులు వివరించారు. అయితే, ఈ సున్నితమైన అంశంపై కొంతమంది రాజకీయ లాభాల కోసం విమర్శలు చేయడం తగదని గ్రామ పెద్దలు అభిప్రాయపడుతున్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపకపోతే తహశీల్దార్, పంచాయతీ కార్యాలయం ముందు ధర్నాలకు దిగుతామని, భారీ జన సందోహాన్ని కూడగట్టి ఆందోళనలు చేపడతామని అన్నారు.

## చేవెళ్లలో ఘనంగా కొమురయ్య జయంతి వేడుకలు

**ముఖ్యఅతిథిగా పి.సబితా ఇంద్రారెడ్డి**



**చేవెళ్ల ఏప్రిల్ 3 సూర్య న్యూస్ :–** తెలంగాణ వీరయోధుడు దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా చేవెళ్లలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పి. సబితా ఇంద్రారెడ్డి పాల్గొని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆమె మాట్లాడుతూ కొమురయ్య త్యాగాలు యువతకు ఆదర్శమని అన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు పెద్దోళ్ల ప్రభాకర్, విజయభాస్కర్ రెడ్డి, నత్తి కృష్ణ రెడ్డి, మల్లా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రీడింగ్ ఛాంపియన్షిప్ పోటీలో పన్నూరు విద్యార్థికి ద్వితీయ స్థానం



**రామగిరి ఏప్రిల్ 03 సూర్య న్యూస్:–** జిల్లా స్థాయిలో నిర్వహించిన రీడింగ్ ఛాంపియన్షిప్ కాంపిటీషన్ పోటీలలో రామగిరి మండలం పన్నూరు ప్రభుత్వ పాఠశాల విద్యార్థి దీక్షకు తెలుగు విభాగంలో రెండవ స్థానం సాధించింది. జిల్లా స్థాయి పోటీలలో రెండవ స్థానం సాధించిన దీక్షకు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష చేతుల మీదుగా బహుమతి అందుకుంది. సెకండ్ ప్రైజ్ పొందిన దీక్షను మండల విద్యాధికారి ఎనగందుల కొమురయ్య, సర్పంచ్ చిందం మహేష్, పాఠశాల హెడ్ మాస్టర్ కవిత అభినందించారు.

## దొడ్డి కొమరయ్య ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి



**వలిగొండ ఏప్రిల్ 03 సూర్య న్యూస్ :–** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య పాశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వలిగొండ పట్టణ కురుమ సంఘం పట్టణ అధ్యక్షులు కంకల కృష్ణ కురుమ అన్నారు. శుక్రవారం దొడ్డి కొమురయ్య 99వ జయంతి కార్యక్రమాన్ని మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కురుమలంతా రాజకీయ చైతన్యంతో ముందుకు సాగాలని ఆయన అన్నారు. గత ప్రభుత్వం కోకాపేటలో 5 ఎకరాల స్థలంలో ఏడున్నర కోట్లతో నిర్మించిన భవనం కురుమ విద్యార్థులకు కేటాయించాలని, ఈ భవనాన్ని అన్యాక్రాంతం చేయడానికి చూస్తే భవిష్యత్తులో మరో పోరాటం తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కొడి కృష్ణ కురుమ, రేగు బీరప్ప కురుమ, ఈతాప రాములు కురుమ, ఈతాప నరసింహ కురుమ, ఎమ్మె మల్లేశం కురుమ, మలుగు నాగులు కురుమ, కొక్కల శ్రీనివాస్ కురుమ, మోటే సత్యనారాయణ కురుమ, ఉల్లిపే పాండు కురుమ తదితరులు పాల్గొన్నారు.

## వాణిజ్య దుకాణాల కోసం ఆసక్తి గల వారికి అవకాశం 10న వేలం

**శంకర్ పల్లి ఏప్రిల్ 03 సూర్య న్యూస్ :–** జిల్లా కలెక్టర్, రంగారెడ్డి జిల్లా గారి ఆదేశాల మేరకు శంకరపల్లి మండలంలోని జి.హెచ్.యం.సి నిర్మించిన వివిధ రెండు పడక గదుల గృహాల కాలనీలలో ఖాళీగా ఉన్న వాణిజ్య దుకాణాలను "ఉన్నది ఉన్నట్లుగా" విధానంలో విక్రయించుటకు జిల్లా కలెక్టర్ / గృహ నిర్మాణ శాఖ కార్యనిర్వాహక అధికారి బహిరంగ వేలం నిర్వహించుచున్నారు. ఇట్టి వేలం తేదీ 10-04-2026 నాడు ఉదయం 9:30 గంటల నుండి 11:00 గంటల వరకు చేవెళ్ల విభాగ ఆర్.డి.ఓ కార్యాలయంలో జరుగును. మొత్తం దుకాణాల సంఖ్య 79 కాగా, వాటి విస్తీర్ణం 60 చదరపు అడుగుల నుండి 180 చదరపు అడుగుల వరకు ఉంటుంది. ప్రభుత్వం నిర్ణయించిన కనీస ధర ప్రతి చదరపు అడుగుకు రూ. 2200గా నిర్ణయించబడింది. వేలంలో పాల్గొనదలచిన వారు ముందుగా భద్రతా నగదు రూ. 36,000 (ముప్పై ఆరు వేల రూపాయలు మాత్రమే) చెల్లించి వేలంలో పాల్గొనవలెను. చెల్లింపు విధానంగా ఏదైనా జాతీయ లేదా అనుమతించబడిన బ్యాంకు ద్వారా "జిల్లా కలెక్టర్, రంగారెడ్డి జిల్లా" పేరిట డిమాండ్ దస్తావేజు తీసుకొనవలెను. ఇందుకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం గృహ నిర్మాణ కార్యాలయం (దూరవాణి: 9063191168 మేనేజర్, 8712032727 ప్రాజెక్టు సంచాలకులు) చేవెళ్ల ఆర్.డి.ఓ కార్యాలయం (దూరవాణి: 8008013151)ను సంప్రదించవచ్చును.

## భారజల ఉద్యోగి ఉరేసుకొని మృతి



**అశ్వాపురం ఏప్రిల్ 3 సూర్య న్యూస్:–** భారజల ఉద్యోగి ఉరేసుకొని మృతి చెందిన ఘటన గురువారం రాత్రి గౌతమీనగర్ కాలనీలో చోటు చేసుకుంది. సిఐ జి అశోక్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ములుకూరి వెంకటరెడ్డి (48)తన యొక్క క్వార్టర్ లో గురువారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్ కు ఉరి వేసుకుని మరణించాడు. మరణానికి అతని యొక్క ఆరోగ్య సమస్యలే కారణమని మృతుని తోడల్లుడు కె ప్రతాపరెడ్డి ఫిర్యాదు చేయగా సీ ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## నియోజకవర్గ ఇంచార్జి ని కలిసిన నూతన జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులు

**కొంపల్లి ఏప్రిల్ 03 సూర్య న్యూస్ :–** పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ ఆమోదంతో, డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ నాయకత్వంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుండి మెడ్చల్‌మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీకి నూతనంగా నియమితులైన సభ్యులు బాచుపల్లి లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులుగా ముత్యం రెడ్డి, బుయ్యని శివ కుమార్, జనరల్ సెక్రటరీలుగా బైరి ప్రశాంత్ గౌడ్, సోమన్న, శ్రీధర్ రెడ్డి, గోపాల్ రెడ్డి, సెక్రటరీలుగా పందరి రావు, గణేష్; కార్యనిర్వాహక సభ్యులుగా లక్ష్మి చౌదరి, కరణ్ ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ బలోపేతం, సంస్థాగత నిర్మాణం, ప్రజా సమస్యలపై సమిష్టిగా పనిచేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ మైసిగారి శ్రీనివాస్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాంచందర్, హరి కిరణ్ పటేల్, చందు, రాజు చారి, తైలం శ్రీనివాస్, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.



## టంగుటూరులో యువకులకు క్రీడా సామాగ్రి పంపిణీ చేసిన బీఆర్ఎస్ యువజన గ్రామ ఉపాధ్యక్షుడు శేరిగూడెం శ్రీకాంత్

**శంకర్ పల్లి ఏప్రిల్ 03 సూర్య న్యూస్ :–** శంకర్పల్లి మండలం టంగుటూరు గ్రామంలో గ్రామ యువకులకు బీఆర్ఎస్ యువజన గ్రామ ఉపాధ్యక్షుడు శేరి గూడెం శ్రీకాంత్ క్రికెట్ బ్యాట్లు, వికెట్లు, బాల్స్ పంపిణీ చేశారు. యువతను క్రీడల వైపు ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.



## డిసీసీ ని కలిసిన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నూతన కాంగ్రెస్ కమిటీ కార్యవర్గం

**కొంపల్లి ఏప్రిల్ 03 సూర్య న్యూస్ :–** కొంపల్లి డివిజన్ పరిధిలోని నూతనంగా ఎన్నికైన మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యవర్గం బైరి ప్రశాంత్ గౌడ్, గోపాల్ రెడ్డి జనరల్ సెక్రటరీలుగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు, కొంపల్లి కాంగ్రెస్ నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా గ్రంథాలయ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి మేడ్చల్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



